సాక్షి
విజయనగరం

బుధవారం । 15 । నవంబర్ । 2023



కనుల పండువగా.. ఉయ్యాల కంబాల

- 8లో

పైడితల్లి అమ్మవారి సిరిమానోత్సవంలో చివరి ఘట్టమైన ఉయ్యాల కంబాల ఉత్సవం మంగళవారం వైభవంగా జరిగింది.



విద్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం

విద్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని అభ్యసనాభివృద్ధి కార్యక్రమం స్టేట్ నోడల్ ఆఫీసర్ కల్పన అన్నారు.

- 8లో

వెండి రేకుపై నెహ్రూ చిత్రం



రాజాం సిటీ: నెహ్రూ జయంతిని పురస్కరించుకొని రాజాం పట్టణంలోని కస్పావీధికి చెందిన మైక్రో ఆర్టిస్ట్, స్వర్ణకారుడు ముగడ జగదీష్ 0.800 మిల్లీగ్రాముల వెండి రేకుపై 20 నిమిషాల్లో చాచా నెహ్రూ చిత్రాన్ని చెక్కాడు. చూపరులను అబ్బురపరిచాడు.

న్యూస్‌రీల్

పాలవలస విక్రాంత్‌కు సహాయ మంత్రి హోదా



వీరఘట్టం: రాష్ట్ర శాసనమండలి ప్రభుత్వ విప్ పాలవలస విక్రాంత్‌కు సహాయ మంత్రి హోదా కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం జీఓ జారీ చేసింది. తొలుత ఎమ్మెల్సీగా గుర్తించి, ఆ తర్వాత శాసన మండలి ప్రభుత్వ విప్ హోదా కల్పించి, నేడు సహాయ మంత్రిగా అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డికి విక్రాంత్ కృతజ్ఞతలు తెలిపారు. 2024లో జరగనున్న శాసనసభ ఎన్నికల్లో పాలకొండ, రాజాం, పాతపట్నం నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించి జగన్‌మోహన్‌రెడ్డికి కానుకగా ఇవ్వడమే తమ ముందున్న ధ్యేయమన్నారు. విక్రాంత్‌కు ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతితో పాటు వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు అభినందనలు తెలిపారు.

ఉషకు వెయిట్ లిఫ్టింగ్‌లో రజతం



విజయనగరం రూరల్: విజయనగరానికి చెందిన బంగారు ఉష (అయేషా) ముంబయిలో నిర్వహించిన ఆల్ ఇండియా రైల్వే చాంపియన్‌షిప్ వెయిట్‌లిఫ్టింగ్ పోటీలో రజత పతకాన్ని సాధించింది. 64 కేజీల విభాగంలో పతకాన్ని సొంతం చేసుకున్నట్టు జిల్లా వెయిట్‌లిఫ్టింగ్ అసోసియేషన్ తెలిపింది. ఆమెకు పలువురు క్రీడాకారులు అభినందనలు తెలిపారు.

హెచ్‌ఐవీ రోగులు ఏఆర్‌టీ మందులు వాడాలి

విజయనగరం ఫోర్ట్: హెచ్‌ఐవీ రోగులు ఏఆర్‌టీ మందులను క్రమం తప్పకుండా వాడేలా చూడాలని జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ కె.రాణీ సూచించారు. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలోని ఏఆర్‌టి కేంద్రంలో మంగళవారం సాయంత్రం స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వచ్చే వారం నుంచి జిల్లాలో ప్రమాదకర ప్రవర్తన కలిగిన వేశ్యవృత్తిలో ఉన్న మహిళలకు, స్వలింగ సంపర్కులకు హెపటైటీస్-బి, సి పరీక్షలు నిర్వహించి అనంతరం హెపటైటిస్-బి వ్యాక్సిన్ అందిస్తామన్నారు. కార్యక్రమంలో డీపీఎం బాలాజీ, డాక్టర్ వరలక్ష్మి, సాక్షి గోపాలరావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

● మా ఊరి
మహిళా పోలీస్..!

ఊరిలో శాంతిభద్రతలకు విఘాతం కలిగే పరిస్థితులు తలెత్తినా.. అమ్మాయిలపై అల్లరిమూకలు వికృతచేష్టలకు పాల్పడినా.. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా చేస్తున్నా. ఇలా.. ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరిగినా పోలీస్ ఉన్నతాధికారులకు వెంటనే సమాచారం వెళ్తుంది. చకచకా చర్యలు ఉంటాయి. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన సచివాలయ వ్యవస్థలో నియమించిన మహిళా సంరక్షణ పోలీస్‌లు పల్లెలు/వార్డుల్లో శాంతిభద్రతల పర్యవేక్షణలో కీలకభూమిక పోషిస్తున్నారు. చట్టాలపై అవగాహన కల్పిస్తూ.. మహిళల్లో చైతన్యం నింపుతున్నారు. 'మా ఊరి మహిళా పోలీస్'గా గుర్తింపు పొందుతున్నారు.



రామభద్రపురం పోలీస్ స్టేషన్‌లో ఎంఎస్‌పీలకు విధులపై సూచనలిస్తున్న సీఐ తిరుమలరావు, ఎస్‌ఐ సురేంద్రనాయుడు (ఫైల్)

- నిరంతరం శాంత్రిభద్రతల పర్యవేక్షణ
- అసాంఘిక కార్యకలాపాలు, అలజడులపై పోలీస్ అధికారులకు ముందస్తు సమాచారం
- మాదకద్రవ్యాల రవాణా నియంత్రణలో కీలక భూమిక
- పేకాట శిబిరాల నిర్వహణపై సమాచారం చేరవేత
- దిశ యాప్ వినియోగంపై అవగాహన
- చట్టాలపై మహిళల్లో చైతన్యం కల్పిస్తున్న మహిళా సంరక్షణ పోలీసులు
- నేరాల సంఖ్య తగ్గుముఖం

ఎన్‌ఫోర్స్‌మెంట్ కేసులు

విజయనగరం జిల్లాలో 2022లో పేకాట ఆడినవారిపై 112 కేసులు, కోడిపందాలు ఆడుతున్నవారిపై 22 కేసులు, మద్యం తరలిస్తున్నవారిపై 780 కేసులు, సారా తయారీ, రవాణాదారులపై 461 కేసులునమోయ్యాయి. 1,98, 410 లీటర్ల సారా ఊటను ధ్వంసం చేశారు.

- గంజాయి అక్రమరావాణాదారులపై 2021లో 32 కేసులు నమోదుకాగా, 2022లో 50 కేసులు నమోదయ్యాయి. 89 మందిని అరెస్టుచేసి, వారి నుంచి 3,180 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సమాచారం చేరవేతలో మహిళా పోలీసులదే కీలక పాత్ర.
- జిల్లాలో 77 సారా ప్రభావిత గ్రామాలను గుర్తించారు. సారా విక్రయదారులు 79 కుటుంబాలకు ప్రత్యామ్నాయ ఉపాధికల్పనకు రూ.43.31లక్షలు ఎస్పీ అందజేశారు.

సాక్షి, విజయనగరం డెస్క్: ఊరిలో చిన్నపాటి వివాదం జరిగినా.. భార్యాభర్తల మధ్య వివాదాలు తలెత్తినా.. ఎవరైనా అమ్మాయిలపై అసభ్యంగా ప్రవర్తించినా.. ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించినా.. బెట్టింగ్‌లు జరిగినా.. ఇలా ఏ చిన్నపాటి వివాదమైనా గతంలో పోలీస్ స్టేషన్‌కు పరుగు తీయాల్సిన పరిస్థితి. ఎస్‌ఐ ఫోన్ నంబర్ కోసం ఆరా తీయాల్సిందే. గత నాలుగేళ్లుగా రాష్ట్రంలో ఆ పరిస్థితి తగ్గింది. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సచివాలయ వ్యవస్థ ఏర్పాటులో భాగంగా ఊరు/వార్డుకో మహిళా సంరక్షణ పోలీస్‌ను నియమించింది. శాంతిభద్రతల పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించింది. క్షేత్రస్థాయిలో ఎలాంటి ఘటనలు జరిగినా తక్షణమే సమాచారం అందజేసే వ్యవస్థను అభివృద్ధి చేసింది. ప్రభుత్వ పాలనాపరమైన సేవలతో పాటు చట్టపరమైన సేవలనూ ప్రజలకు చేరువ చేసింది. గ్రామం/వార్డులో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేవారిపై మహిళా పోలీస్‌లు ప్రత్యేక నిఘా ఉంచుతున్నారు. వారి కార్యకలాపాలను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ఆ సమాచారాన్ని పోలీస్ ఉన్నతాధికారులకు చేరవేస్తున్నారు. ఆంధ్రా-ఒడిశా సరిహద్దులో సారా తయారీ కేంద్రాల వివరాలు.. గంజాయి తరలింపు.. మద్యం అక్రమ విక్రయదారుల సమాచారం.. అల్లర్లకు పాల్పడేవారు... రౌడీ షీటర్లు, పాతనేరస్తుల కదలికలు గమనిస్తూ నేరాలను అడ్డుకట్టవేయడంలో కీలక భూమిక పోషిస్తున్నారు. పల్లెలు/వార్డు ప్రజల ప్రశాంత జీవనానికి బాటలు వేస్తున్నారు. చట్టాలపై మహిళలకు అవగాహన కల్పిస్తున్నారు. సైబర్ నేరాలపై ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. దిశ ఎస్‌ఓఎస్ యాప్ పనితీరును వివరిస్తున్నారు. రుణ యాప్‌లపై చైతన్యం కలిగిస్తున్నారు. మహిళల భద్రతకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరిస్తున్నారు. ప్రతిరోజూ ఊరు/వార్డు ప్రజలకు అందుబాటులో ఉంటూ పోలీస్‌పరమైన సేవలు అందిస్తూ.. మా ఊరి మహిళా పోలీస్‌లుగా పిలిపించుకుంటున్నారు.

ఎంతమంది పనిచేస్తున్నారు...		
జిల్లా	సచివాలయాలు	మహిళా సంరక్షణ పోలీస్‌లు
విజయనగరం	626	618 (8 ఖాళీలు)
పార్వతీపురంమన్యం	350	350



కొమరాడ మండలం గుమడ పాఠశాల విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఎంఎస్‌పీ

చట్టాలపై అవగాహన



నేను డిగ్రీ తెలుగు లిటరేచర్ చేశాను. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన సచివాలయ వ్యవస్థలో మహిళా పోలీస్ ఉద్యోగం సాధించాను. అప్పటి నుంచి ప్రభుత్వం అప్పజెప్పిన బాధ్యతలను క్షేత్రస్థాయిలో చిత్తశుద్ధితో నిర్వర్తిస్తున్నాను. గ్రామంలో శాంతిభద్రతలు నెలకొల్పేందుకు కృషిచేస్తున్నాను. దిశ, ఎస్‌ఓఎస్ యాప్, రుణ యాప్‌లపై అవగాహన కల్పిస్తున్నాను. నేరాలను ప్రాథమిక దశలోనే నియంత్రించేలా సమాచారాన్ని పోలీస్ ఉన్నతాధికారులకు చేరవేస్తున్నాను.

- కె.జయశ్రీ, గొల్జాం ఎంఎస్‌పీ, ఎల్.కోట

గర్వంగా ఉంది



బీకాం చదివాను. సచివాలయ మహిళా పోలీస్‌గా కొలువుదక్కడంతో కుటుంబానికి ఆర్థిక భద్రత లభించింది. ప్రతిరోజూ ప్రజలకు సేవచేసే అవకాశం కలిగింది. గ్రామంలో ఏ చిన్నపాటి వివాదం తలెత్తినా వివరాలను పోలీస్ అధికారులకు చేరవేస్తాను. సమస్యను ప్రాథమిక దశలోనే పరిష్కరించేందుకు కృషిచేస్తా. పల్లె ప్రజల ప్రశాంత జీవనం కోసం పనిచేయడం గర్వంగా ఉంది. అధికారుల సూచనల మేరకు విధులు నిర్వర్తిస్తున్నాను.

- కె శోభ, ఎంఎస్‌పీ, కొట్టక్కి సచివాలయం, రామభద్రపురం మండలం

మహిళలకు రక్షణ కవచం



రాష్ట్రంలో ఉన్న మహిళలందరికీ సీఎం జగన్ మోహన్ రెడ్డి రక్షణ కవచంగా నిలిచారు. అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ఎంతో మేలు చేశారు. నా లాంటి ఎంతో మంది మహిళలకు ఉద్యోగ అవకాశాలు కల్పించి మా కాళ్లపై మేము నిలబడేలా చేశారు. కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా జీవిస్తున్నామంటే జగనన్న దయవల్లే అని ధైర్యంగా చెబుతున్నాను. గ్రామాల్లో మాకు అప్పగించిన బాధ్యతలను తు.చ తప్పకుండా నెరవేరుస్తున్నాం. ముఖ్యంగా బాల్య వివాహాలు జరగకుండా చూస్తున్నాం. మహిళల రక్షణ కోసం తెచ్చిన దిశ యాప్ ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తున్నాం.

- జి.దివ్య, ఎంఎస్‌పీ, కొండగుంపాం సచివాలయం, నెల్లిమర్ల మండలం

విధుల్లో ప్రతిభ చూపుతున్నాం..



బీఎస్సీ చదివాను. సచివాలయ వ్యవస్థలో మహిళా సంరక్షణ పోలీస్ (ఎంఎస్‌పీ) ఉద్యోగానికి ఎంపికయ్యాను. నాలుగేళ్లుగా సచివాలయ పరిధిలోని ప్రజలకు సేవలందిస్తున్నాను. చట్టాలపై అవగాహన కల్పిస్తున్నాను. ప్రభుత్వం మహిళలకు కల్పిస్తున్న రక్షణ చర్యలను వివరిస్తున్నాను.

- వి.లావణ్య, ఎంఎస్‌పీ, తారాపురం సచివాలయం, రామభద్రపురం మండలం

ఆశయాలకు అనుగుణంగా...



ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన సచివాలయ వ్యవస్థలో మహిళ పోలీస్‌గా ఉద్యోగం సాధించాను. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తున్నా. మహిళలపై నేరాల కట్టడి, బెల్టుషాపుల నియంత్రణ, పేకాట, బెట్టింగ్‌లకు అడ్డుకట్ట వేయడం, నేరప్రవృత్తిగల వ్యక్తుల సమాచారాన్ని చేరవేయడంలో ప్రధాన భూమిక పోషిస్తున్నాం. యువత చెడు అలవాట్ల బారిన పడకుండా అవగాహన కల్పిస్తున్నాం. శాంతిభద్రతల సమస్య తలెత్తితే వెంటనే పోలీస్‌స్టేషన్‌కు సమాచారం చేరవేరుస్తున్నాం.

- బి.శాంతివర్ధిని, మహిళా పోలీస్, చెరుకుపల్లి సచివాలయం, భోగాపురం మండలం

ప్రతి గింజా కొనుగోలు

- ఆర్‌బీకేల వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు
- దళారుల ప్రమేయాన్ని అరికట్టేందుకు చర్యలు
- కొనుగోలు ప్రక్రియ సవ్యంగా సాగేలా కంట్రోల్ రూం
- 'సాక్షి' ప్రత్యేక ఇంటర్వ్యూలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్



వ్యవసాయ, ధాన్యం కొనుగోలు సిబ్బంది శిక్షణ సమావేశంలో మాట్లాడుతున్న జేసీ మయూర్ అశోక్

సాక్షి ప్రతినిధి, విజయనగరం: విత్తనాల నుంచి పంట కొనుగోలు వరకూ ప్రతి దశలోనూ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రైతులకు అండదండలు అందిస్తోంది. రైతుభరోసా కేంద్రాలతో వ్యవసాయం దిశాదశా మార్చు చేసేందుకు నడుంబిగించింది. గత నాలుగేళ్లలో సకాలంలో వర్షాలతో పంటలు సమృద్ధిగా పండాయి. ఈసారి మాత్రం వర్షాభావ పరిస్థితులతో కొన్ని ప్రాంతాల్లో పంట నష్టం జరిగింది. దీనికి పంటల బీమా పథకం ద్వారా ప్రభుత్వం ఆదుకుంటుందని, పండిన ప్రతి గింజా పక్కాగా పారదర్శకంగా కొనుగోలు చేస్తామని విజయనగరం జిల్లా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ స్పష్టం చేశారు. ఆయన 'సాక్షి'కి ప్రత్యేకంగా ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే...

వర్షాభావంతో కొంతమేర పంట నష్టం...

వర్షాభావ పరిస్థితుల ప్రభావం ఈ ఏడాది ఖరీఫ్‌లో పంటలపై కొంతమేర ఉంది. కానీ సగటు వర్షపాతం ప్రకారం చూస్తే జిల్లాలో కరువు లేదనే చెప్పాలి. ముఖ్యంగా వరి జిల్లాలోని 2.31 లక్షల ఎకరాల్లో రైతులు సాగు చేశారు. జూన్, ఆగస్టు, అక్టోబర్ నెలల్లో సకాలంలో వర్షాలు పడలేదు. ఫలితంగా సుమారు 5,600 ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లింది. జిల్లాలో మొత్తం 540 రైతుభరోసా కేంద్రాల (ఆర్‌బీకేల) పరిధిలో వరి సాగు కాగా, ఇప్పుడీ పంట నష్టం 200 ఆర్‌బీకేల పరిధిలో ఉన్నట్లు అధికారులు నిర్ధారించారు. ప్రస్తుతం నీటి ఎద్దడి ఏర్పడిన ప్రాంతాల్లోని సుమారు 2 వేల ఎకరాల్లో వరి పంట ఎండిపోతోంది. 90 ఎకరాల్లో రాగి పంట దెబ్బతింది. ఇప్పుడు ఏమైనా వర్షాలు పడితే తేరుకొనే అవకాశం ఉంది. గ్రామ వ్యవసాయ సహాయకుల నుంచి ప్రతి రోజూ రిపోర్టు తీసుకుంటున్నాం. వ్యవసాయ శాఖ జిల్లా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు. వర్షాభావ పరిస్థితుల్లో పంటను ఏవిధంగా కాపాడుకోవాలనేది రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

పంట నష్టపోతే బీమా అండ...

ఖరీఫ్ వరి పంటకోత ప్రయోగాలు ప్రారంభమయ్యాయి. ఇవి పూర్తయితే దిగుబడి పరిస్థితి ఏమిటో తెలుస్తుంది. వర్షాభావ పరిస్థితుల వల్ల ఎంతమేర నష్టం వాటిల్లిందీ రూఢీ అవుతుంది. సాధారణ దిగుబడి కన్నా ఎంత నష్టం జరిగిందో గణించి ఆ మేరకు పంటల బీమా పథకం ద్వారా పరిహారం మంజూరవుతుంది. మన జిల్లాలో వరి, మొక్కజొన్న, పత్తి, జీడిమామిడి పంటలకు డాక్టర్ వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకం వర్తిస్తుంది. ఇ-క్రాప్ నమోదుచేసుకున్న ప్రతిరైతూ పథకానికి అర్హులు.

రబీలో చిరుధాన్యాలకు ప్రోత్సాహం

రానున్న రబీ సీజన్‌లో చిరుధాన్యాల సాగును ప్రోత్సహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ముఖ్యంగా తక్కువ పెట్టుబడి, తక్కువ రిస్క్‌తో ఆరుతడి సరిపోయే రాగి సాగు వైపు రైతులు దృష్టి పెట్టేలా ప్రోత్సహిస్తాం. అవసరమైనవారికి విత్తనాలు సరఫరా చేస్తాం. రాగి పంటను శతశాతం కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉన్నాం. మొక్కజొన్న, మినుములు, పెసలు సాగు కూడా విస్తరించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం.

సకాలంలో ధాన్యం కొనుగోలు

జిల్లాలో రైతులు విక్రయించదలచిన ధాన్యం మొత్తం కొనుగోలు చేస్తాం. డిసెంబర్ నాటికి పంట చేతికొస్తుంది. రైతులు పంట కోతలు ప్రారంభించే నాటికే కొనుగోలుకు సిద్ధంగా ఉండాలనే లక్ష్యంతో ఏర్పాట్లు చేస్తున్నాం. ఆర్‌బీకేలలో కొనుగోలు కేంద్రాలు పెట్టాం. ధాన్యం సంచులు సిద్ధం చేశాం. కొనుగోలు ప్రక్రియను సవ్యంగా సకాలంలో పూర్తి చేసేందుకు అదనపు సిబ్బంది నియామకం పూర్తి చేశాం. మూడు నెలల పాటు సేవలందించేందుకు 750 మందిని నియమించాం. వారిలో 250 మంది చొప్పున టెక్నికల్ అసిస్టెంట్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, హెల్పర్లు ఉన్నారు. వారికి అవసరమైన శిక్షణ ఇస్తున్నాం. భాగస్వాములయ్యే సిబ్బంది అందరికీ అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేశాం. ప్రభుత్వం దీనిపై ఒక వీడియోను రూపొందించింది. దాన్ని అన్ని ఆర్‌బీకేల్లో ప్రదర్శిస్తున్నారు.

దళారీల మాయలో పడొద్దు

రైతుల నుంచి ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది. దళారీల మాయలో పడొద్దు. ఆరుగాలం కష్టపడి పండించింది వారి చేతుల్లో పెట్టవద్దు. మిల్లర్ల వద్దకూ నేరుగా వెళ్లవద్దు. రైతులు తమ పంటను నేరుగా తమ సమీపంలోనే ఆర్‌బీకే వద్ద ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రానికే తీసుకెళ్లాలి. రైతులను ఇబ్బంది పెట్టకుండా ప్రొక్యూర్‌మెంట్ సవ్యంగా సాగేలా సహకరించాలని రైస్‌మిల్లర్లకు స్పష్టంగా చెప్పాం. మరోసారి వారితో సమావేశం పెడతాం. ప్రతి రైస్‌మిల్లు వద్ద ఒక తహసిల్దారు లేదా వీఆర్‌వో కస్టోడియన్ ఆఫీసరుగా ఉంటారు. వారి పర్య వేక్షణలోనే మిల్లింగ్ జరుగుతుంది.

సందేహాల నివృత్తికి కంట్రోల్ రూమ్

వర్షాభావ పరిస్థితుల నుంచి పంటలను ఏవిధంగా రక్షించుకోవాలి, ఎండిపోయిన చోట ప్రత్యామ్నాయ పంటల ఎంపిక తదితర అంశాలపై రైతులకు సందేహాలు ఉంటే నివృత్తి చేసేందుకు వ్యవసాయ శాఖ నడుంబిగించింది. ఇందుకు కలెక్టరేట్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశాం.

కంట్రోల్ రూమ్ నంబర్: 83310 56278

అక్రమాలకు అడ్డుకట్ట వేస్తాం...

ధాన్యం కొనుగోలు, రవాణా, మిల్లింగ్ తదితర ప్రక్రియ అంతా ఎలాంటి అక్రమాలకు తావులేకుండా పారదర్శకంగా పూర్తి చేసేలా ఏర్పాట్లు చేస్తున్నాం. ధాన్యం రవాణాకు వినియోగించదలిచిన దాదాపు 4వేల ట్రాక్టర్లు, లారీలకు జీపీఎస్ ఏర్పాటు చేయిస్తున్నాం. వారం పది రోజుల్లో ఇదంతా పూర్తి అవుతుంది. దళారీల ప్రమేయాన్ని నిరోధించే ఉద్దేశంతో రైతుల బయోమెట్రిక్ తీసుకుంటున్నాం. ఇందుకు అవసరమైన పరికరాలను ఆర్‌బీకేలకు పంపించాం. కొనుగోలులో ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా, దళారులు జోక్యం చేసుకుంటున్నా వెంటనే సమాచారం ఇవ్వడానికి ఒక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేస్తాం.

ఒక్క రైతు కూడా
నష్టపోకూడదు

- పకడ్బందీగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ
- వారం రోజుల్లోనే నగదు జమ



శిక్షణకు హాజరైన గ్రామ వ్యవసాయ సహాయకులు, టెక్నికల్ అసిస్టెంట్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, సహాయకులు

విజయనగరం అర్బన్: ఏ ఒక్క రైతు కూడా నష్టపోకుండా అత్యంత పకడ్బందీగా ధాన్యం కొనుగోలు ప్రక్రియను నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ ఆదేశించారు. ఎవరైనా అవకతవకలకు పాల్పడితే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని, మిల్లర్లను బ్లాక్ లిస్టులో పెడతామని హెచ్చరించారు. త్వరలో ప్రారంభం కానున్న ధాన్యం కొనుగోలు ప్రక్రియపై గ్రామ వ్యవసాయ సహాయకులు, టెక్నికల్ అసిస్టెంట్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, సహాయకులకు స్థానిక ఆనందగజపతి ఆడిటోరియంలో మంగళవారం శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో జేసీ మయూర్ అశోక్ మాట్లాడుతూ రైతు శ్రేయస్సే లక్ష్యంగా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు ప్రక్రియను అత్యంత పకడ్బందీగా రూపొందించిందని తెలిపారు. రైతు ఎంతో కష్టపడి పండించిన ధాన్యానికి సరైన గిట్టుబాటు ధరను ఇవ్వడం మన బాధ్యత అని స్పష్టంచేశారు. ధళారులను, మధ్యవర్తులను దరిచేరనీయవద్దన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను పర్యవేక్షించేందుకు మండల స్థాయిలో తహసీల్దార్లు, ఏఓలను, నియోజకవర్గ స్థాయిలో ఎస్‌డీసీలను ప్రత్యేకాధికారులుగా నియమించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరా అధికారి మధుసూధనరావు, సివిల్ సప్లయిస్ డీఎం మీనాకుమారి, వ్యవసాయశాఖ జేడీ వి.టి.రామారావు, ఉద్యానశాఖ డీడీ జమదగ్ని, జిల్లా సహకార అధికారి రమేష్, మార్క్‌ఫెడ్ డీఎం విమల పాల్గొన్నారు.

ఎంచుకున్న రంగాల్లో ప్రోత్సహిద్దాం



చిన్నారులకు రోజాపూలను అందజేస్తున్న ఎస్పీ ఎం.దీపిక

విజయనగరం క్రైమ్: పిల్లలు ఎంచుకున్న రంగాల్లోనే రాణించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని ఎస్పీ ఎం.దీపిక పిలుపునిచ్చారు. బాలల దినోత్సవాన్ని కంటోన్మెంట్‌లో ఉన్న పోలీస్ వెల్ఫేర్ ఆంగ్ల పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడుతూ భారతదేశ తొలి ప్రధాని చాచా నెహ్రూకు పిల్లలంటే చాలా ఇష్టమని, ఏ కార్యక్రమానికి ఆయన వెళ్లినా పిల్లలతో తరచూ ముచ్చటించేవారన్నారు. నేడు విద్యార్థులకు అన్ని రంగాల్లో అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని, వాటిని అందిపుచ్చుకుని, రాణించాలన్నారు. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో నిర్వహించిన చిన్నారులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏఎస్పీ అస్మా ఫర్హీన్, ఏఆర్ డీఎస్పీ యూనివర్స్, ఎస్‌బీ సీఐలు కేకేవీ విజయనాథ్, ఇ.నరసింహమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

16న రాజాంలో సామాజిక సాధికార యాత్ర

విజయనగరం రూరల్: రాజాంలో ఈ నెల 16న సామాజిక సాధికార బస్సుయాత్ర నిర్వహించనుందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న యాత్రలో పార్టీ రీజనల్ కో-ఆర్డినేటర్ వై.వి. సుబ్బారెడ్డి, ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొంటారని తెలిపింది.

రూట్ మ్యాప్ ఇలా...

- గురువారం ఉదయం 10.30 గంటలకు రాజాం మండల పరిధిలోని బొద్దాం గ్రామంలో పత్రికా సమావేశం నిర్వహిస్తారు.
- అనంతరం బొద్దాం గ్రామంలో ఉన్న గ్రామ సచివాలయం సందర్శన
- మధ్యాహ్నం తృప్తి రిసార్ట్ వద్ద భోజనం విరామం. ● మధ్యాహ్నం 3 గంటలకు రాజాం పట్టణంలోని పాలకొండ రోడ్డులో బహిరంగ సభ వద్దకు యాత్రగా చేరుకుంటారు.

క్లుప్తంగా

ఉపాధ్యాయుడిపై సస్పెన్షన్ వేటు

- లైంగిక వేధింపులకు పాల్పడిన ఉపాధ్యాయుడిపై చర్యలకు ఉపాధ్యాయ సంఘాల డిమాండ్

విజయనగరం అర్బన్: పూసపాటిరేగ మండలం చోడమ్మ అగ్రహారం ప్రాథమికోన్నత పాఠశాలలో తెలుగు టీచర్‌గా పనిచేస్తున్న వై.శంకరగిరినాయుడిని సస్పెండ్ చేస్తూ డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి మంగళవారం ఆదేశాలు జారీచేశారు. పాఠశాల బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడన్న ఆరోపణలు ప్రాథమికంగా నిర్ధారణ కావడంతో సీసీఏ రూల్స్ ప్రకారం చర్యలు తీసుకున్నట్టు డీఈఓ తెలిపారు. 610 జీవోపై జిల్లాలో బాధ్యతలు స్వీకరించిన శంకరగిరినాయుడు తొలినుంచి వివాదస్పదంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. గతంలో ఓ పార్టీతరఫున బహిరంగ ప్రచారం చేయడంతో విద్యాశాఖ అధికారులు మెమోజారీ చేశారు. ఎంఈఓ సంతకం ఫోర్జరీ చేసి రూ.50 వేలు మెడికల్ బిల్లు పెట్టారన్న వివాదం ఆయనపై నడుస్తోంది. గంట్యాడ నుంచి ఇటీవల పూసపాటిరేగ మండలానికి సర్దుబాటులో వచ్చి ఉపాధ్యాయ వృత్తికి అగౌరం తెస్తున్నారని, ఆయన ప్రవర్తనపై చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

నేటి నుంచి అండర్-14/17 స్కూల్ గేమ్స్ జట్ల ఎంపిక

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న 67వ స్కూల్‌గేమ్స్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారుల ఎంపిక పోటీలు ఈ నెల 15 నుంచి నిర్వహిస్తున్నట్లు అండర్-14/17 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఎల్‌వీ రమణ మంగళవారం తెలిపారు. ఈ మేరకు 15న బొండపల్లి మండలంలోని గరుడబిల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రగ్బీ పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 18న భోగాపురం మండలంలోని రావాడ జెడ్పీ హైస్కూల్‌లో క్రికెట్ క్రీడాకారుల ఎంపిక, 21న నెల్లిమర్లలోని ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో ఫుట్‌బాల్ క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహిస్తామని వివరించారు. ఎంపిక పోటీల్లో నిర్ణీత వయస్సు కలిగిన క్రీడాకారులు పాల్గొనేందుకు అర్హులని, జిల్లా స్థాయిలో అర్హత సాధించిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు.


చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹90	₹150	₹160

కనుల పండువగా.. ఉయ్యాల కంబాల

- అమ్మదర్శనానికి పోటెత్తిన భక్తులు
- ఇరుముడిధారణ చేసిన పైడితల్లి దీక్షాధారులు



ఊయలలో అమ్మవారి ఉత్సవవిగ్రహంతో ఆశీనులైన సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు

విజయనగరం టౌన్: పైడితల్లి అమ్మవారి సిరిమానోత్సవంలో చివరి ఘట్టమైన ఉయ్యాల కంబాల మహోత్సవం మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. భక్త కోటికి సిరులిచ్చే చిన్నారి పైడిమాంబ ఊయల ఊగుతూ భక్తులను ఉత్సాహపరిచింది. ఉయ్యాల కంబాల ఉత్సవాన్ని భక్తులు తన్మయత్వంతో తిలకించారు. చదురుగుడి ఆవరణలో ప్రత్యేకంగా అలంకరించిన ఉయ్యాల చుట్టూ అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని మూడుమార్లు ప్రదక్షణ చేశారు. అనంతరం సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు సమక్షంలో అమ్మవారిని ఉయ్యాలలో ఆశీనులను చేసి ఉత్సవాన్ని సంప్రదాయంగా నిర్వహించారు. అమ్మవారి ఘటాలకు విశేష పూజలు చేశారు. ఉయ్యాల కంబాల అనంతరం సిరిమానుతో పాటు తెచ్చిన రాటకు మూడుసార్లు గొడ్డలి ఆనించి ఉయ్యాలను తీసివేశారు. దీంతో అమ్మవారి జాతరకు ముగింపు పలికినట్లేనని, బుధవారం వనంగుడి వద్ద చండీహోమం పూర్ణాహుతితో జాతర ముగుస్తుందని అర్చకులు తెలిపారు. ఉత్సవం పూర్తయిన తర్వాత అమ్మవారిని మేళతాళాలతో వనంగుడికి తీసుకువెళ్తారు. బుధవారం నుంచి అమ్మవారు వనంగుడిలో భక్తులకు ఆరు నెలల పాటు దర్శనమిస్తారు. కార్యక్రమానికి ముందు ఆలయ కార్యనిర్వహణాధికారి కె.ఎల్.సుధారాణి మాట్లాడుతూ నెలరోజుల జాతర మహోత్సవాలు ఈ నెల 14న బుధవారం వనంగుడిలో నిర్వహించే దీక్షా విరమణలతో పూర్తవుతాయని వివరించారు. సిరిమానోత్సవం రోజున అమ్మవారిని దర్శించలేని భక్తులు ఉయ్యాలకంబాల రోజున దర్శించుకున్నారు. స్వచ్ఛంద సంస్థలు, దేవదాయశాఖ ఆధ్వర్యంలో భక్తులకు మంచినీరు, పులిహోర, మజ్జిగ, ప్రసాదం ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అమ్మదర్శనానికి పోటెత్తిన భక్తులు

వేకువజామునుంచి అమ్మవారికి అర్చకులు పంచామృతాలతో అభిషేకాలు, విశేష కుంకుమార్చనలు జరిపారు. ఆలయ ప్రధాన అర్చకులు ఏడిద రమణ, తాళ్లపూడి ధనుంజయ్, వేదపండితులు తాతా రాజేష్, దూసి శివప్రసాద్, సాయి కిరణ్, శంబరి కృష్ణల ఆధ్వర్యంలో పూజలు సాగాయి. అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. గతంలో ఎన్నడూ లేని విధంగా సుమారు 50వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్టు అధికారుల అంచనా. ఉదయం నుంచే క్యూలైన్లు కోట వరకు బారులు తీరాయి. మధ్యాహ్నం 2 గంటలవరకు భక్తుల తాకిడి కొనసాగింది. అమ్మవారికి వివిధ వేషధారణలతో మొక్కుబడులు చెల్లించారు.

వనంగుడిలో విశేష పూజలు

రైల్వేస్టేషన్ వద్ద ఉన్న పైడితల్లి అమ్మవారి వనంగుడిలో వేకువజాము నుంచి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు జరిగాయి. వేదపండితులు వెలువలపల్లి నరసింహమూర్తి, సాయిలు శాస్త్రోక్తంగా పూజలు చేశారు. అనంతరం అర్చకులు రవి ఆధ్వర్యంలో అమ్మవారికి, బాలాలయంలో చిన్నారి పైడితల్లికి, ఆలయ ఆవరణలో పుష్పాలతో ప్రత్యేక అలంకరణలు జరిగాయి.

నేడు దీక్షాపరుల ర్యాలీ

బుధవారం వేకువజామున 6 గంటల నుంచి ఇరుముడి కట్టిన పైడితల్లి అమ్మవారి దీక్షాదారులు అమ్మవారి నామస్మరణతో చదురుగుడి నుంచి ఇరుముడినెత్తుకుని అమ్మవారి ఉత్సవవిగ్రహంతో వనంగుడికి బయలుదేరుతారు. వనంగుడి వద్ద నిర్వహించే చండీహోమం , పూర్ణాహుతి కార్యక్రమాల్లో దీక్షాపరులు పాల్గొంటారు. పూర్ణాహుతి పూర్తయిన తర్వాత దీక్షా విరమణలు చేస్తారు. దీంతో ఉత్సవం పూర్తవుతుంది.

సీఎం జగన్‌కు కళింగ కోమట్ల కృతజ్ఞతలు



ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌ను సత్కరిస్తున్న కళింగ కోమటి సామాజిక వర్గం ప్రతినిధులు

చీపురుపల్లి: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కళింగ కోమటి సామాజిక వర్గాన్ని బిసి'డి'లో చేర్చినందుకు రుణపడి ఉంటామని ఆ సామాజిక వర్గం ప్రతినిధులు సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు మంగళవారం వారు విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌ను చీపురుపల్లి పట్టణంలో కలిసి సత్కరించి, ఆయన ద్వారా సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పూర్వ కాలం నుంచి కళింగ కోమటి సామాజిక వర్గం ఓసీ జాబితాలోనే ఉండేదని, దివంగత మహానేత వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రతిపాదనలోకి వచ్చిందన్నారు. ఆయన మరణానంతరం ఎలాంటి పురోగతి లేకుండా పోయిందన్నారు. అయితే 2013లో కళింగ కోమటి సామాజిక వర్గాన్ని బిసి'డి' జాబితాలో చేర్చాలని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం జీవో ఇచ్చినప్పటికీ శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలకు మాత్రమే వర్తించిందన్నారు. ఇదే విషయాన్ని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ ద్వారా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కళింగ కోమటి సామాజిక వర్గాన్ని బిసి'డి'లో చేర్చుతూ జీవో విడుదల చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం ద్వారా తమ సామాజిక వర్గంలో ఆర్థికంగా వెనుకబడి ఉన్న ఎంతో మందికి మేలు జరుగుతుందని సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సూరు కామేష్, ఎస్‌వీజీ .శ్రీనివాసరావు, కింతలి మధు, అందవరపు హరి, గోవింద, కింతలి శ్రీను, ఖండ్యాన వసంత్, సుంకరి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

చెరువు గట్టు తవ్వేసి రోడ్డు నిర్మాణం

- అడ్డుకున్న రెవెన్యూ అధికారులు



చెరువు గట్టు తవ్వేసి రోడ్డు వేసేందుకు చదును చేసిన దృశ్యం

లక్కవరపుకోట: ఆయన పెద్ద భూస్వామి. తన మామిడి తోటకు కారులో వెళ్లేందుకు తగిన రోడ్డు కావాలి. అయితే రోడ్డు వేసుకునేందుకు అవకాశం లేదు. దీంతో ఏకంగా చెరువు గట్టును తవ్వేసి రోడ్డు నిర్మాణం చేపట్టిన దురాక్రమణ పర్వం వివరాలిలా ఉన్నాయి. మండలంలోని లచ్చింపేట గ్రామ రెవెన్యూ పరిధిలో విశాఖపట్నానికి చెందిన అత్తిల వెంకటరమణకు సర్వే నంబర్ -82లో మామిడి తోట ఉంది. ఆ తోటకు వెళ్లేందుకు సరైన రహదారి లేదు. దీంతో ఆయన తన కారు వెళ్లేందుకు రహదారిని నిర్మించాలని నిర్ణయించి 81 సర్వే నంబర్‌లో గల ఎర్ర చెరువు గట్టును పూర్తిగా తవ్వేసి రోడ్డును ఏర్పాటు చేసేందుకు రాళ్లు పేర్చి సిద్ధమయ్యారు. ఈ విషయాన్ని ఆ చెరువు కిందనున్న ఆయకట్టు రైతులు గమనించి తహసీల్దార్ కల్యాణ చక్రవర్తికి ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు వీర్రాజు, సన్యాసిరావులు క్షేత్రస్థాయిలో పరిశీలించి చెరువు గట్టును అక్రమంగా తవ్వేసినట్లు గుర్తించారు. రోడ్డు నిర్మాణ పనులను అడ్డుకుని సదరు వ్యక్తిపై పోలీస్‌కేసు నమోదు చేసేందుకు తహసీల్దార్ కల్యాణ చక్రవర్తికి సిఫారసు చేశారు.

చేతివృత్తుల పునరుద్ధరణ ఆనందదాయకం



చేతివృత్తుల శిక్షణకేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ కారెం శివాజీ

జామి: అంతరించిపోతున్న చేతివృత్తుల పునరుద్ధరణ హర్షణీయమని ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ కారెం శివాజీ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన జామి మండలంలోని బలరాంపురం గ్రామంలో ఏవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కాల్ స్కిల్ యూనిట్ (విశాఖపట్నం) వారి సౌజన్యంతో ప్రగతిశీల మహిళాసంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృత్తిబడి చేతివృత్తుల శిక్షణాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ స్థానిక అధ్యక్షురాలు కొత్తపల్లి భూలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క మహిళ కరోనా మహమ్మారి తరువాత ఆర్థిక స్వావలంబన, సాధికారత దిశలో కుదేలైపోయారన్నారు. వారి ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచేందుకు ఇటువంటి స్వచ్ఛంద సేవా సంస్థలు శిక్షణ కార్యక్రమాలు చేపట్టి చేతివృత్తులను పునరుద్ధరించి ఆర్థికపరిపుష్టి కలిగించడం అభినందనీయమని ప్రశంసించారు. బలరాంపురంలో ఇటువంటి కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడంపై ఎంవీఆర్ గ్రూప్ నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పిలుపు స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ రవి, స్థానిక పెద్దలు పి.ఎర్నాయుడు తదితరులు పాల్గొన్నారు.


సంతాప పత్రం అందజేత



సంతాప పత్రాన్ని జశ్వంత్ నాయుడుకు అందజేస్తున్న తహసీల్దార్ అరుణకుమారి

గజపతినగరం: ఏపీ శాసన సభ మాజీ సభ్యుడు తాడ్డి సన్యాసినాయుడు ఇటీవల మృతిచెందిన విషయం తెలిసిందే. ఆయన రాష్ట్ర ప్రజలకు అందించిన సేవలను స్మరిస్తూ ఏపీ శాసన సభ సంతాప పత్రాన్ని పంపించింది. దీనిని తహసీల్దార్ అరుణకుమారి సన్యాసినాయుడు కుటుంబసభ్యుడైన డాక్టర్ జశ్వంత్ నాయుడుకు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో డీటీ సత్యనారాయణ పాల్గొన్నారు.

గిరినాగు అలజడి



ఎస్.కోట పట్టణంలోని ఇండియన్ ఆయిల్ బంక్ సమీపంలో రాత్రి 7.30 గంటల సమయంలో సుమారు 13 అడుగుల పొడవు ఉన్న గిరినాగు హల్‌చల్ చేసింది. దీనిని స్థానికులు గుర్తించి స్నేక్‌క్యాచర్ వానపల్లి రామలింగేశ్వరరావుకు సమాచారం ఇచ్చారు. ఆయన చాకచక్యంగా పామును పట్టుకోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. తాటిపూడి రిజర్వాయర్ అటవీప్రాంతంలో పామును విడిచిపెడతానని స్నేక్‌క్యాచర్ తెలిపాడు. - ఎస్.కోట

సర్వీసులు క్రమబద్ధీకరించండి



వినతులు అందుకుంటున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు

విజయనగరం అర్బన్: గిరిజన సహకార సంస్థలో దశాబ్ద కాలంగా కాంట్రాక్టు సేల్స్‌మెన్‌లుగా పనిచేస్తున్నామని, సర్వీసుల క్రమబద్ధీకరణకు రాష్ట్ర ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని కోరుతూ రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరావుకు విజ్ఞప్తి చేశారు. జీసీసీ కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వి.జానకీరావు నేతృత్వంలో విజయనగరంలోని క్యాంపు కార్యాలయంలో శంకరరావును మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షుడు జి.గోపాలరావు, కార్యదర్శి బి.రవినాయక్, జాయింట్ సెక్రటరీ ఆదినారాయణ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీల్లో బంగారు పతకం



హరిప్రసాద్‌ను అభినందిస్తున్న అధ్యాపకులు

చీపురుపల్లి: రాష్ట్రస్థాయిలో జరిగిన సైక్లింగ్ పోటీల్లో చీపురుపల్లి పట్టణంలోని శ్రీ బాలాజీ జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరం ఇంటర్మీడియట్ చదువుతున్న వాల్లె హరిప్రసాద్ బంగారు పతకం సాధించాడు. దీంతో మంగళవారం ఆ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బంగారుపతకం సాధించిన హరిప్రసాద్‌ను కళాశాల యాజమాన్య ప్రతినిధులు మంత్రి గోవింద, యల్లంటి వేణు, అధ్యాపకులు అభినందించారు. ఇటీవల బాపట్లలో జరిగిన అండర్-19 సైక్లింగ్ పోటీల్లో జిల్లా తరఫున హరిప్రసాద్ పాల్గొని చక్కని ప్రతిభ కనపరిచి బంగారు పతకం సాధించాడు.

19 నుంచి 'పంచారామ' సర్వీసులు

- షెడ్యూల్ విడుదల చేసిన డీపీటీఓ అప్పలనారాయణ



విజయనగరం అర్బన్: కార్తీక మాసంలో శైవపుణ్య క్షేత్రాల దర్శనాల కోసం ఆర్టీసీ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పంచారామ సర్వీసులు ఈ నెల 19 నుంచి వచ్చే నెల 10వ తేదీ వరకు ప్రతి ఆదివారం ఉంటాయని జిల్లా ప్రజా రవాణా అధికారి (డీపీటీఓ) సీహెచ్.అప్పలనారాయణ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన సర్వీసుల షెడ్యూల్‌ను విడుదల చేశారు. కార్తీక సోమవారం రోజున ఉత్తరాంధ్రాలోని ప్రధానమైన అమరావతి (అమరేశ్వరుడు), పాలకొల్లు (క్షీర రామలింగేశ్వరుడు), భీమవరం (సోమేశ్వరుడు), ద్రాక్షారామం (భీమేశ్వరుడు), సామర్లకోట (కొమరలింగేశ్వరుడు) పుణ్యక్షేత్రాలు దర్శించినా పవిత్ర కాశీయానం చేసినట్లేనని భక్తుల నమ్మకం. ఈ నమ్మకమున్న భక్తులకు ప్రతి సోమవారం ఈ సేవలను అందుబాటులో ఉంచాలనే లక్ష్యంతో కార్తీక మాసంలో ఆదివారం సర్వీసులను అందిస్తున్నామని తెలిపారు. తొలి సర్వీసును ఈ నెల 19వ తేదీ ఆదివారం సాయంత్రం 4 గంటలకు స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ఈ సర్వీసు బస్సు బయలుదేరి ఐదు క్షేత్రాలను సందర్శించి సోమవారం అర్ధరాత్రికి బయలుదేరిన చోటుకు తిరిగి వస్తుందన్నారు. అలాగే ఈ నెల 26, వచ్చేనెల 3, 10వ తేదీలలో సర్వీసులు ఉంటాయి. ఒక్కొక్కరికీ ఆల్ట్రా డీలక్స్ సర్వీసుకు కేవలం రూ.1,900, సూపర్ లగ్జరీ సర్వీసుకు రూ.1,950 చార్జీ ఉంటుందని వివరించారు. టిక్కెట్‌ను 'ఏపీఎస్ఆర్‌టీసీఆన్‌లైన్.ఐఎన్' లాగిన్‌లో పొందవచ్చన్నారు. అదేవిధంగా దగ్గరలో ఉన్న డిపోకు వెళ్లి కూడా టిక్కెట్ బుక్ చేసుకునే సౌకర్యం ఉందని, పూర్తి వివరాల కోసం ఫోన్ 9959225620, 9494331213, 7382923683 నంబర్లను సంప్రదించవచ్చని తెలియజేశారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం

- స్టేట్ నోడల్ ఆఫీసర్ , రాష్ట్ర పరిశీలకుడు



మాట్లాడుతున్న అభ్యసనాభివృద్ధి కార్యక్రమం స్టేట్ నోడల్ ఆఫీసర్ సైలా కల్పన, రాష్ట్ర పరిశీలకుడు ఎస్ డేవిడ్‌రాజు

రామభద్రపురం: విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తుందని అభ్యసనాభివృద్ధి కార్యక్రమం స్టేట్ నోడల్ ఆఫీసర్ సైలా కల్పన, రాష్ట్ర పరిశీలకుడు ఎస్.డేవిడ్‌రాజు అన్నారు. ఈ మేరకు 6,7,8 తరగతుల విద్యార్థులకు చదవడం, రాయడంలో నైపుణ్యం పెంపొందించేందుకు ఉపాధ్యాయుల తీసుకుంటున్న ప్రత్యేక సాధన పీరియడ్స్‌ను సమర్థవంతంగా నిర్వహించేలా పర్యవేక్షించేలా స్థానిక ఉన్నత పాఠశాలలో బొబ్బిలి డివిజన్‌లోని ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోలకు ఇస్తున్న శిక్షణను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో లక్షలాది మంది విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అనేక విద్యాసంస్కరణలు అమలు చేస్తోందన్నారు. విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంపొందించేందుకు రాష్ట్రంలో 20 జిల్లాల్లో మాత్రమే స్కూల్ కాంప్లెక్స్ స్థాయిలో ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చామని తెలిపారు. విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులే కీలకమని, విద్యార్థుల విద్యా సామర్థ్యం మెరుగు పడేలా ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను విద్యార్థులకు సక్రమంగా అందజేసి వారి అభ్యున్నతికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కోర్స్ కో ఆర్డినేటర్ బ్రహ్మాజీరావు,డైట్ ప్రిన్సిపాల్ తిరుపతినాయుడు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ నాగభూషణరావు పాల్గొన్నారు.

డ్వాక్రా అవకతవకలపై మరో ఆర్పీ అరెస్టు

రాజాం సిటీ: మున్సిపాల్టీ పరిధి పొనుగుటివలస గ్రామానికి చెందిన డ్వాక్రా గ్రూపుల్లో అక్రమాలకు పాల్పడిన మరో ఆర్పీ పొగిరి సంధ్యారాణిని మంగళవారం అరెస్టు చేశామని రూరల్ సీఐ ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ డ్వాక్రా మహిళలకు తెలియకుండా ఇటీవల వరకు ఆర్పీలుగా పనిచేసిన శాసపు ఉమాదేవి, పొగిరి సంధ్యారాణి నగదు స్వాహాచేసిన విషయంపై మెప్మా సీఓ దానాలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టామని తెలిపారు. ఎ2 సంధ్యారాణి చేసిన అవకవతకలపై గ్రూపుల సభ్యులను విచారించగా రూ.13.30 లక్షల మేరకు దుర్వినియోగానికి పాల్పడినట్లు తేలిందన్నారు. ఆమె అవకతవకలకు పాల్పడిన మొత్తంలో ఇప్పటి వరకు బ్యాంకులో రూ. 5.55 లక్షలు చెల్లించగా ఇంకా రూ. 7.75 లక్షలు కట్టాల్సి ఉందని పేర్కొన్నారు. ఈ కేసులో ఎ1 ఉమాదేవిని ఇదివరకే అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న అప్పారావు

శృంగవరపుకోట: మండలంలోని ధర్మవరం గ్రామానికి చెందిన గిడుతూరి అప్పారావు(46) ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్.కోట ఎస్సై లోవరాజు మంగళవారం చెప్పారు. అప్పారావు తాగుడుకు బానిస కావడం, స్థిరత్వం లేక పోవడంతో ఆయన భార్య విడిచిపెట్టి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపం చెందిన అప్పారావు ఇంట్లోనే ఉరివేసుకున్నాడు. ఈ విషయం గమనించిన తల్లి లక్ష్మి ఇరుగుపొరుగు వారికి చెప్పడంతో వారు పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు వచ్చి పరిశీలించిన సమయంలో తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు ఏఎస్సై వెంకటరమణ కేసు నమోదు చేశారని ఎస్సై వివరించారు.